మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల /నారాయణపేట

# ప్రచారం బంద్..!





- మంగళవారం సాయంత్రం 5గంటలకు సమాప్తం..
- మూగబోయిన మైకులు..
- ఇప్పటికే డబ్బులు పంపిణీ షురూ..
- రెండు రోజులు ఏరులై పారనున్న మద్యం..
- నవంబర్ 30న పోలింగ్..డిసెంబర్3న ఫలితాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,నవంబర్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం ఎట్టకేలకు ముగిసింది. మంగళవారం సాయంత్రం 5గంటలకు మైకులు మూగబోయాయి. నేటి సాయంత్రం తర్వాత కూడా ఎలాంటి మీడియా సమావేశం నిర్వహించరాదని ఈసీ ఆదేశాలు ఉన్నాయి. దీంతో మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన పార్టీల తోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచార ర్యాలీలు నిర్వహించారు. మైకులు, డీజేల మోతలతో పట్టణాలన్నీ మార్మోగాయి. రేపు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఎన్నికల ఫలితాలు అభ్యర్థులు భవితవ్యం డిసెంబర్ 3న తేలనున్నది.

**మూగబోయిన మైకులు..**

నెల రోజులకు పైగా దప్పుల మోతలు, డీజేల శబ్దాలు, మైకుల సప్పుడతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఒకటే శబ్దాలు. ప్రచారాలతో అలసిబేజారిపోయారు. ఆటోలు, జీపులు, డీసీఎంలల్లో మైకులతో ప్రచారం నిర్వహించారు. ఎల్ఈడీ వాల్స్‌లో డాక్యుమెంటరీలు చేయించి కూడా తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సారి ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్రం పోషించిందని చెప్పవచ్చు. ఎవరికి వారే పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా సేకరించి గ్రూప్‌లు, కమ్యూనిటీలు ఏర్పాటు చేసి తాము అనుకున్న మెసేజ్, ప్రచారాలు, మేనిఫెస్టోలోని అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేర్చేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. గ్రూప్ కాల్స్, వాయిస్ కాల్స్ ద్వారా తమకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్నారు. అవకాశం ఉన్న ఏ ఒక్క దారిని కూడా వదల్లేదని తెలుస్తున్నది.

**ఆత్మీయ సమ్మేళనాలు..**

ఇప్పటికే వివిధ కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలతో వివిధ పార్టీల అభ్యర్థులు సమావేశాలు నిర్వహించారు. కమ్యూనిటీల వారీగా వారికి కావాల్సిన భవనాలు, ఇతర అంశాలకు సంబంధించి హామీలు ఇప్పటికే ఇచ్చినట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అన్ని సంఘాలతో పాటు, వర్గాలు, కులాల వారీగా, దివ్యాంగులు, వృత్తుల వారీగా ఇలా ఒక్కో కమ్యూనిటీకి వారికి సంబంధించిన పథకాలు, ఇప్పటికే అమలు చేసినవి, రానున్న ఐదేండ్లలో చేసేవి క్షుణ్ణంగా వివరిస్తూ ఓటర్లను ఆర్షించే చర్యలుతీసుకున్నారు. అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఓటర్లు పోలింగ్ బూత్ దగ్గర ఓటు వేసే వరకు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**డబ్బులు, మందు ఫుల్లు..**

పోలింగ్‌కు రెండు రోజులే ఉండడంతో ప్రలోభాలు పెట్టి అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించుకునే పనిలో పడ్డారు. ఓటుకు రూ. 1000నుంచి రూ.3వేలకు వరకు ఇస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో అయిలే సర్పంచులకు, ఆయా వార్డు మెంబర్లకు, బడా నాయకులకు, పట్టణాల్లో అయితే వార్డులుగా, గల్లీలుగా, విభజించి నాయకులకు అప్పజెప్పే పనిలో పడ్డారు. 100ఓట్లకు ఒకరిని కేటాయించి మొత్తం డబ్బులు, ఇతర ఖర్చులు చూసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ ఇక ఒక్క రోజు మిగలడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొన్నది. అభ్యర్థుల ఐదేండ్ల భవిష్యత్తు ఓటరు తీర్పుతోనే తేలనున్నది. బుధవారం రాత్రి వరకే ఓటర్లకు మద్యం, డబ్బులు పంపిణీ చేసేందుకు సర్వత్రా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అయితే పోలింగ్ గురువారం సాయంత్రంతో ముగిసినా, తీర్పు వెలువడేది మాత్రం డిసెంబర్ 3నే. అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు ఐదేండ్లలో చేపట్టబోయే కార్యాచరణతో బీఆర్ఎస్ అభ్యర్థులు జనాల్లోకి వెళ్తుండగా, మార్పు నినాదంతోపాటు మహిళా,రైతుసంక్షేమం, యువతకు భరోసా పేరుతో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారాస్త్రాలుగా వాడుకొని ప్రజల్లో తిరిగారు. బీజేపీ అభ్యర్థులు, బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి నినాదంతో రామారాజ్యం తెస్తామంటూ ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఇక అభ్యర్థుల భవిష్యత్తు, భవితవ్యం, ఓటర్ల చేతిలో ఉన్నది. అది రేపటితో తేలిపోనుండగా ఫలితాలకు మాత్రం డిసెంబర్3వరకు వేచి ఉండాల్సిందే.

## వనపర్తి జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమలు : ఎస్పీ రక్షిత కృష్ణ మూర్తి



**వనపర్తి క్రైం,నవంబర్ 28,ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 30న ఎన్నికలు ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉందని జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణ మూర్తి తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 076 దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గంలోని కొత్తకోట,మదనపూర్,077 మక్తల్ నియోజకవర్గంలో ఆత్మ కూరు,అమరచింత 078 వనపర్తి నియోజకవర్గంలో రేవల్లి,గోపాల్పేట,వనపర్తి, గణపురం,పెద్దమందడి,పెబ్బేరు,శ్రీరంగాపూర్ మండలాలు, 085 కొల్లాపూర్ నియోజకవ ర్గంలోని పానగల్, వీపనగండ్ల,చిన్నంబాయి మండలాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

1. వనపర్తి జిల్లా పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుంపులు గుంపులుగా తిరగొద్దని తెలిపారు.
2. రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు,గుర్తులు, ప్లకార్డులు ధరించొద్దని ప్రదంర్శించొద్దని తెలిపారు.
3. మైకులు,లౌడ్ స్పీకర్లు వాడరాదని, రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు,ఉపన్యాసాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు.
4. విజయోత్సవ ర్యాలీలు,సభలు,సమావేశాలు నిర్వహించవద్దన్నారు.
5. ధర్నాలు,రాస్తోరోకోలు,ఊరేగింపులు,టపాకాయలు కాల్చడం లాంటి కార్యక్రమాలను నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తుల పై,ఎన్నికల సంఘం యొక్క నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి..

### జిల్లా శిక్షణ నోడల్ అధికారి రవిందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త :** డిసెంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని జిల్లా శిక్షణ నోడల్ అధికారి రవిందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల బాలికలలో నిర్వహించిన ఎన్నికల కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్స్‌కి శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రైనింగ్స్ నోడల్ అధికారి రవిందర్ మాట్లాడుతూ ప్రతి లెక్కింపు అధికారి ఎలక్షన్ మాడ్యుల్ ప్రకారం మూడు తారీఖు రోజు నిర్వహించే ఓట్ల లెక్కింపులో ఎటువంటి పొరపాట్లు లేకుండా సవ్యంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఇంఛార్జి దుంకుడు శ్రీనివాస్, మాస్టర్ శిక్షకులు ప్రసన్నకుమార్, ప్రకాష్, సురేష్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవిందర్

## ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..

### ఎన్నికల పరిశీలకులు బిపి చౌహాన్

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త :** ఈనెల 30న జరిగే సాధారణ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు బిపి చౌహాన్ తెలిపారు. మంగళవారం మక్తల్ నియోజకవర్గంలోని ఈవిఎంలో స్ట్రాంగ్ రూమ్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలిసి మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే ఈవిఎంల స్ట్రాంగ్ రూమును, పోలింగ్ మెటీరియల్‌ను తనిఖీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు బస్సుల ద్వారా ఈవిఎం సామాగ్రిని ఆయా సెక్టోరియల్ వారిగా తరలించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు కుర్చీలు, టేబుళ్లు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్




## పోలింగ్‌కు సర్వం సిద్ధం..!

- జిల్లాలో శాంతియుత ఎన్నికలకు అభ్యర్థులు, పార్టీలు సహకరించాలి
- జిల్లా యేతరులు జిల్లాని వదిలిపెట్టి వెళ్లాలి
- 802 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- శాంతియుత ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 28 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ కొనసాగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎన్ఐసీ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుందని, ఆ తర్వాత అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎక్కడ కూడా ఏ విధమైన ప్రచారం కూడా నిర్వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. 30వ తేదీన ఉదయం 5 గంటల్లోగా ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. 48 గంటల ముందు ఒపినియన్ పోల్స్, డిబేట్, ఇంటర్వ్యూలు, అనాలసిస్ వంటివి నిర్వహిస్తే నిబంధనలు ఉల్లంఘటనల క్రిందకు వస్తుందని తెలిపారు. పార్టీల నాయకులు ఓటర్లకు స్లిప్పుల పంపిణీ చేయడం, ఓటర్లకు వాహనాలు ఏర్పాటు చేయకూడదని, ఆ పనులు ఈసీఐ యంత్రాంగం ద్వారా చేపడుతుందన్నారు. 28న సాయంత్రం 5 గంటల నుంచి 30న సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఎంసీసీ ఉల్లంఘనలు, మద్యం, డబ్బులు పంపిణీకి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే కాల్ సెంటర్ 1950 సి విజిల్‌లో నమోదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వదంతులు సృష్టించవద్దని, అనుమానాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. ఏ సమస్యనైనా పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ఎన్నికల విధుల్లో నియామకమైన ఉద్యోగులు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ దాఖలు చేసేందుకు 29 వరకు అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలో ఎన్నికలను పారదర్శంగా శాంతియుతంగా నిర్వహిచేందుకు అభ్యర్థులతో పాటు మీడియా సహకరించాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఆర్ఓ తిరుపతయ్య, మీడియా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

### ఎన్నికల నిర్వహణలో రానున్న 48 గంటలు..

## మరింత అప్రమత్తత అవసరం..

**ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి :జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 28 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో రాబోయే 48 గంటలు అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకులు మిథిలేష్‌మిశ్రా అన్నారు. ప్రత్యేక పరిశీలన బృందాలు అమ్రపత్తంగా ఉండాలని సూచించారు. వ్యయ పరిశీలకులు బేరా రామ్‌చౌదరి, జర్నల్ అబ్జర్వర్ సతీష్‌కుమార్, పోలీస్ అబ్జర్వర్ ఇస్మాయిల్, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లతో కలిసి నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. ఎన్నికల అధికారులు ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియకు ఎన్నికల విభాగం అధికారుల కీలక పనులు మొదలవుతాయని వివరించారు. 144 సెక్షన్ అమలులోకి వస్తుందన్నారు. పార్టీల ప్రచారాలను నిలిపివేయాలన్నారు. 29,30 తేదీల్లో దినపత్రికల్లో, టీవీ చానెల్లలో ఇచ్చే ఇతర్వాత ఎన్నికల విభాగం అధికారుల కీలక పనులు మొదలవుతాయని వివరించారు. ఈ నెల 30 ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే పోలింగ్ ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తతో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏ ఒక్క అధికారి అలసత్వం ఉండటానికి వీలు లేదన్నారు. జిల్లాలో శాంతియుతంగా పోలింగ్ నిర్వహించేలా ప్రతి ఎన్నికల నోడల్ అధికారి అత్యంత జాగ్రత్తగా విధు లు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి.ఉద య్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల బాధ్యతలను నోడల్ అధికారులు పూర్తి పర్యవేక్షణలో అత్యంత జాగ్రత్తగా నిర్వ హించాలని ఆదేశించారు. వచ్చే ఫిర్యాదుల పట్ల అప్రమ త్తంగా వ్యవహరిస్తూ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిం చాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జిల్లా ఎన్నికల వివిధ విభాగాల నోడల్ అధికారులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## ఎక్కడివారక్కడే గప్‌చుప్..!!

- ప్రచారార్భాటాలకు తెర..
- ఓటరు స్లిప్పులతో ప్రలోభాలకు ఎరా..
- ఆరంభమైన పార్టీల నిశ్శబ్ద ప్రచారాల యుద్ధం..
- ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆరాటం..

**భూత్పూర్,నవంబర్ 28,ప్రభాతవార్త :** మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచార ఘట్టానికి తెరపడడంతో ఆయా పార్టీల అభ్యర్థులు,నాయకులు,కార్యకర్తలు ప్రచారార్భాటాలకు స్వస్తి పలికి ఓటరు స్లిప్పుల పంపిణీ పేరిట తుది ప్రయత్నంగా ఇంటింటికి వెళ్లి ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు,వారిని మభ్యపెట్టేందుకు ఆఖరి ప్రయత్నంగా తమ వంతు కృషిచేస్తున్నట్లు తెలుస్తోంది.ఎన్నికలకు గడువు ఇంకా ఒక్క రోజే మిగిలి ఉండడం,,ప్రత్యక్ష ఎన్నికల ప్రచారార్భాటాలకు మంగళవారంతో తెర పడ డంతో ఆయా పార్టీలు,అభ్యర్థులు,నాయ కులు,కార్యకర్తలు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.తమ భవితవ్యాన్ని తేల్చే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు,మభ్యపెట్టేందుకు, ప్రలోభాలకు లోనుచేసేందుకు అంతిమ ప్రయత్నాలు చేసే దిశగా అడుగులేస్తున్నారు.ఇదే క్రమంలో ఎలాంటి ఆర్భాటాలకు,హంగామాలకు తావివ్వకుండా సాదాసీదాగా ఇంటింటికి వెళ్తూ ఓటర్ స్లిప్పులను పంచుతూ ఓటర్లను ప్రలోబపెట్టేందుకు రంగం సిద్దం చేసుకున్నట్లు తెలిసింది.పార్టీ ముఖ్యనేతలొకరిద్దరు ఆయా వార్డుల ఓటర్ల జాబితాను చేతపుట్టుకుని ఇంటింటికి వెళ్లి ఓటర్లను నచ్చజెప్పే ప్రయత్నాలతో పాటు వారిని ప్రసన్నం చేసుకునే యత్నాలు చేస్తున్నట్లు కూడా తెలిసింది.దేవరకద్ర నియోజక వర్గ అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి డీసీసీ అధ్యక్షుడు జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్),బీజేపీ తరఫున కొండా ప్రశాంత్‌రెడ్డి ప్రధానంగా పోటీపడుతుండగా,బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)నుంచి బసిరెడ్డి సంతోష్‌రెడ్డి,ధర్మ సమాజం పార్టీ నుంచి భూత్పూర్ మండల కర్వెన గ్రామానికి చెందిన జంగయ్య,ప్రజా ఏక్తా పార్టీ నుంచి భూత్పూర్ పట్టణానికి చెందిన గడ్డం ఎల్లప్పలు పోటీలో ఉండగా,స్వతంత్ర అభ్యర్థిగా భూత్పూర్ మండలం పాతమెల్గర గ్రామానికి చెందిన మందడి వెంకటనర్సింహ్మారెడ్డి ఎమ్మెల్యే ఎన్నికకు పోటీ పడుతున్నారు.ఎంతమంది పోటీలో ఉన్నప్పటికి ప్రధానంగా బీఆర్ఎస్,కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోటీ ఉండగలదని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.ఎన్నికల ప్రచారాలకు ఆయా పార్టీల అగ్రనేతలు సైతం ఆహ్వానించి తమ ఓటు బ్యాంకును కూడగట్టుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు విశ్వప్రయత్నాలు చేశారు.బీఆర్ఎస్ తరఫున సీఎం కేసీఆర్,బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు ఎంపిలు,జెడ్పీ చైర్మన్‌ను ఎన్నికల ప్రచారంలో పాల్గొనే విధంగా ఆహ్వానాలు పలుకగా,ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నుంచి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ,ప్రియాంక గాంధీలను ఆహ్వానించారు.ఈ నెల 27న కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్నను కూడా ఆహ్వానించి దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట,అడ్డాకుల, మూసాపేట,భూత్పూర్ మండలాల్లో కాంగ్రెస్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించింది.తీన్మార్ మల్లన్న సభలు, రోడ్‌షోలకు కాంగ్రెస్ నాయకు లు, అభిమానులు,అశేషంగా తరలిరావడం విశేషమని చెబుతున్నారు.ఏదేమైనా హ్యాట్రిక్ సాధించేందుకు అధికార పార్టీ అభ్యర్థి,సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,బోణి కొట్టేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీఎంఆర్,బీజేపీ అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి అలుపెరగని పోరాటంతో పాటు నానా తంటాలు పడుతూ ఆరాటపడుతున్నారని చెప్పకతప్పదు..



## మద్యం,డబ్బుతో ఓటర్లను ప్రభావితం చేయలేరు..!

- మంత్రి పై ధ్వజమెత్తిన రాచాల ..
- చిన్న మందడిలో లారీని వెంబడించి మద్యం పోలీసులకు పట్టించిన రాచాల యుగంధర్ గౌడ్
- రాచాలపై కర్రలతో దాడికి యత్నించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు..
- ఉల్లంఘన పై ఎన్నికల కమిషన్,జిల్లా ఎస్పికి ఫిర్యాదు
- పట్టుబడిన మద్యం 8160 (170 కాటన్లు 48)రాయల్ స్టాగ్ బాటిల్స్ ఉన్నట్లు వెల్లడించిన అధికారులు

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 28,ప్రభాతవార్త:** భూ కబ్జా కోరు మంత్రి నిరంజన్ రెడ్డి ఎన్నికల ఓటమి భయంతో మద్యం,డబ్బుతో ఓటర్లను ప్రభావితం చేసే పని చేస్తున్నారని.నీ అవినీతి,అక్రమాలు తెలిసిన ఓటర్లు నమ్మే పరిస్థితిలో లేరని..డిసెంబర్ 3 తర్వాత నీవు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఖాళీ చేసే ఇంటికెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నేత రాచాల యుగంధర్ గౌడ్ ధ్వజమెత్తారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచా మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలం చిన్న మందడిలో సోమవారం రాత్రి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తెచ్చిన మంత్రి నిరంజన్ రెడ్డి మద్యం లారీని వెంబడించి అడ్డుకున్నామని,కానీ కొందరు బిఆర్ఎస్ నాయకులు అడ్డుకున్న నాపై కర్రలతో దాడికి యత్నించారని అన్నారు.అయినప్పటికీ పోలీసులకు మద్యం లారిని పట్టించడం జరిగిందని. పట్టుబడిన మద్యం దాదాపు 8160 (170 కాటన్లు 48) రాయల్ స్టాగ్ బాటిల్స్ ఉన్నట్లు అధికారులు వెల్లడించినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మద్యం పంపిణి చేస్తున్నారని ఎన్నికల కమిషన్,జిల్లా ఎస్పికి పిర్యాదు చేశామని రాచాల వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన మంత్రి నిరంజన్ రెడ్డి ఓటమి భయంతో మద్యం,డబ్బులతో ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నారని.నీ గురించి గుర్తెరిగిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు.మంత్రి నిరంజన్ రెడ్డి అధికారులను చేతిలో పెట్టుకొని ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడ్డారని,బిఆర్ఎస్ నాయకుల దౌర్జన్యాల పై పలుమార్లు ఉన్నతాధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

గుడి,బడుల నుంచి సంతల వరకు ఏమీ వదలకుండా మంత్రి నిరంజన్ రెడ్డి మందల ఎకరాలు కబ్జా చేశారని ఒకప్పుడు ఏమి లేదని చెప్పిన మంత్రికి ఇన్ని వందల ఎకరాలు ఎక్కడివని ప్రశ్నించారు.వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి పేరుతో మంత్రి రూ.కోట్లు దండుకున్నారని,అవినీతి,కబ్జాకోరు మంత్రిని ఎన్నికల్లో ఓడించి ఫామ్‌హౌస్‌కు పంపించాల్సిన అవసరం నియోజకవర్గం ప్రజలపై ఉందన్నారు.ఒక వ్యవసాయ మంత్రిగా ఉన్న నీవు ఇంత నీచ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని,నీ దౌర్జన్య,అక్రమ ఆరాచక రాజకీయాలకు డిసెంబర్ 3 తర్వాత ప్రజలు స్వస్తి పలుకుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్, చీర్ల చందర్,శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాచాల



పట్టుబడిన మద్యం

## కొల్లాపూర్ నియోజకవర్గ బిసి సమాజ్ తాలూకా కన్వీనర్‌గా దుర్గేష్ నియామకం


నియామక పత్రం అందుకుంటున్న దుర్గేష్

**వీపనగండ్ల, నవంబర్ 28, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన బలమోని దుర్గేష్ ను కొల్లాపూర్ నియోజకవర్గ బిసి సమాజ్ తాలుకా కన్వీనర్‌గ నియమిస్తూ నియామక పత్రం ఇస్తున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర సమాజ్ అధ్యక్షులు సూర్యారావు ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మోడల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ సమాజాన్ని ఈ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్ గానే గుర్తించి. రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నారు అని ఆయన అన్నారు. బీసీ సమాజంవిద్యా, ఉద్యోగం, రాజకీయ రంగాలలో చైతన్యం అయిన రోజే మహనీయుల ఆశయాలు నెరవేరుతాయని ఈ సందర్భంగా వారు అన్నారు. చట్టసభల్లో మేమెంతో మాకు అంతా అనేనినాదంతో ముందుకు పోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, బాలకృష్ణ, నిరంజన్, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోండి


ఎస్పి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాల కవాతు దృశ్యం

**వీపనగండ్ల, నవంబర్ 28, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్ర పరిధిలోని తూముకుంట గ్రామంలో ఎస్పి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి రవి ప్రకాష్ మాట్లాడుతూ ప్రజలు ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును శాంతియుత వాతావరణం లో ఎన్నికల సంఘం కేటాయించిన సమయంలోపు ఓటు అదేవిధంగా మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుండి నవంబర్ 30వ తారీఖు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని అందుకే ప్రజలు నలుగురికి నుంచి ఎక్కువగా గుంపులు గుంపులుగా ఉండవద్దని తెలియజేశారు. 30 తేదీన జరిగే ఎన్నికలకు ఎవరైనాఆటంకం కలిగిస్తేచట్టపరమైనచర్యలుతీసుకుంటామని తెలియజేశారు.

## మద్యం షాపులు బంద్

● అతిక్రమిస్తే ప్రజా ప్రాతినిధ్యం చట్ట ప్రకారం కఠిన చర్యలు

● జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దిన్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్28 ప్రభాత వార్త:** ఈ నెల 30న నాగర్‌కర్నూల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వైన్స్, బార్లు, కల్లు కంపౌండ్లను 28న మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మూసి వేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దిన్ తెలిపారు. 30న పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి షాపులు తెరుస్తారన్నారు. అదే విధంగా డిసెంబర్ 3వన కౌంటింగ్ సందర్భంగా కూడా మద్యం దుకాణాలను మూసి వేస్తు న్నట్లు ఆయన తెలిపారు. ఎవరైన అక్రమంగా మద్యం విక్రయించినా, మద్యం నిలువ చేసిన వారిపై 1951 ప్రజా ప్రాతినిధ్యం చట్టం 135సి ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.


ఆఖరి రోజు బిఆర్ఎస్ ప్రచారం

## పోటాపోటీగా ర్యాలీలు..

**వీపనగండ్ల, నవంబర్ 28, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రం లోని వీపనగండ్లతో సహా అన్ని గ్రామపంచాయతీలలో ఆఖరి రోజు ఎన్నికల ప్రచారం హెూరా హెూరీగా కొనసాగింది. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఆఖరి రోజు అయినందున ప్రచారం చేయడంలో పోటీపడ్డారు. ఎవరికీ వారు గెలుపు పై విశ్వాసం వ్యక్తం చేస్తూ ప్రచారం నిర్వహించారు. తమ పార్టీల మేనిఫెస్టో ప్రజలకు ఇంటింటికి తిరుగుతూ వివరించడం జరిగింది. రాజకీయ పార్టీల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ మా పార్టీకే ఓటు వేయాలని వీధి వీధి తిరుగుతూ హెూరెత్తిన నినాదాలతో ప్రచారం నిర్వహించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల ఫలితం డిసెంబర్ మూడో తారీఖున ఓట్ల లెక్కింపులో పోటీ చేసిన ఎమ్మెల్యేల అభ్యర్థుల భవిష్యత్తు తెలుస్తుందని ప్రజలు అనుకుంటున్నారు.


ఆఖరి రోజు కాంగ్రెస్ ప్రచారం

## బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**పాన్‌గల్, నవంబర్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంక్షేమ పథకాలను చూడండి, అలాగే బిఆర్ఎస్ తోనే అభివృద్ది సాధ్యం అవుతుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాధవరావు పల్లిలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు ఉచిత విద్యుత్తు రైతుబంధు రైతు బీమా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ఆసరా పెన్షన్లు ఇంటి ఇంటికి తాగునీరు తదితర పథకాలను ప్రతి కడపకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కృష్ణ, గురువయ్య పాల్గొన్నారు.

# మూగబోయిన మైకులు

● ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

**ఇటిక్యాల, నవంబరు 28 ప్రభాతవార్త:** కేంద్ర ఎన్నికల ఆదేశాల మేరకు ఈనె 30వ తేదీన పోలింగ్ జరుగుతుండడంతో 48 గంటల ముందు ప్రచారం ముగించాలని ఆదేశాలతో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల ప్రచారానికి తెరపడింది. దీంతో నవంబర్ నెల 10వ తేదీ నాటికి నామినేషన్లు వేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ బిజెపి, బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు అలంపూర్, గద్వాల నియోజకవర్గాలలోని పల్లెల్లో, పట్టణాలలో మున్సిపాలిటీ కేంద్రాలలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఒకవైపు ఆటోలతో మైకులు ఏర్పాటు చేసి, ప్రచార రథాలతో ఆయా పార్టీలు తయారు చేసిన పాటలతో హోరెత్తించారు. అభ్యర్థులు గ్రామాలలో ప్రచారానికి వెళ్లిన సమయంలో ప్రచార రథాలపై ప్రజలనుద్దేశించి అధికారానికి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను కర్ణాటక రాష్ట్రం తరహాలో అమలు చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజలకు వివరిస్తూ వచ్చారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తే రైతులకు ప్రజలకు నిరుద్యోగులకు, యువకులకు, మహిళలకు మెరుగైన పథకాలు అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచార సభలలో గద్వాల, అలంపూర్‌లో ప్రజా ఆశీర్వాద సభలలో మంత్రి కెసిఆర్ పాల్గొని కాంగ్రెస్ పార్టీనినమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అయిజలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, విజయశాంతి, గద్వాల, శాంతినగర్ సభలలో పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొని బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో అంతా అవినీతి మయమని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఉద్యమకారులను పక్కన పెట్టారని పలు విమర్శలు చేస్తూ కార్యకర్తలను చైతన్యపరిచారు. అదేవిధంగా సోమవారం నాడు గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి సరితకు మద్దతుగా ప్రియాంకగాంధి ప్రచార సభలో పాల్గొని బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన అవినీతి పాలనపై విమర్శలు చేసి ప్రజలను చైతన్యం కల్పించారు. అదేవిధంగా గద్వాల బిజెపి అభ్యర్థి శివారెడ్డి తరపున దేశ హోంమంత్రి అమిత్‌షా కూడా పాల్గొన్నారు. గద్వాల, అలంపూర్, బిఎస్పీ పార్టీ అభ్యర్థుల తరపున రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచార సభలో పాల్గొన్నారు. అయితే ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసిన నాటినుండి నడిగడ్డలో పోటీచేసిన


ఎన్నికల ప్రచారానికి తెరపడడంతో మూగబోయిన ప్రచార వాహనం

కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, బిఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కానీ నడిగడ్డలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల ప్రచారం ఉధృతంగా సాగి గ్రామాలలో ప్రచారాలు సైతం నువ్వా నేనా అన్న చందంగా సాగింది. ప్రైవేట్ గ్రామాలలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పక్షాన ఆ గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాలు జోరుగా కొనసాగించారు. దాదాపు ఎన్నికల ప్రచార ప్రక్రియ నవంబర్ నెల మొత్తం కొనసాగడంతో నేటితో ప్రచారానికి తెరపడింది. ఈనెల 30వ తేదీ గురువారం సాధారణ ఎన్నిక పోలింగ్ జరుగుతుండగా ఈ రెండు రోజులుకూడా ఓటర్లను కలుస్తూ వారిని ప్రలోభాలకు గురి చేస్తూ మా పార్టీల అభ్యర్థులను ఆశీర్వదించాలని కూడా ఓటర్లను కలువనున్నారు. ఇవన్నీ దాటుకుని ప్రజలు పోలింగ్‌లో పాల్గొని వారికి నచ్చిన అభ్యర్థికి ఓటు దేశ అవకాశాలు ఉండనుండగా 30వ తేదీన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగి డిసెంబర్ మూడో తేది ఆదివారం ఓట్ల లెక్కింపులో నడిగడ్డగాపిలవబడేఅలంపూర్, గద్వాల నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలుగా గెలుపుఎవరిని వరిస్తుందోఇందులో ఎవరుఅదృష్టవంతులో వేచి చూడాలి.

## బహిరంగ ప్రచారానికి తెర

**కల్వకుర్తి, నవంబర్ 28, ప్రభాతవార్త:** 2023 శాసనసభ ఎన్నికలకు ఈ నెల 03న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి అభ్యర్థులు ప్రజలను ఆకట్టుకునేందుకు ఆటోలను, ద్విచక్ర వాహనాలను ప్రచార సాధానలుగా చేసుకొని వాటికి ఆయా స్థాయిల్లో మెక్‌సెట్లను, సౌండ్‌బాక్స్‌ను బిగించి గ్రామ గ్రామాన ప్రచార జోరును కొనసాగించారు. గత 20 రోజుల నుంచి ఉదయం నుంచి మొదలు కొని పెద్ద శబ్దాలతో ప్రచార రథాలు ఊరూరా రాత్రి 10గంటల వరకు ప్రచారాన్ని కొనసాగించాయి. ఇక ఎన్నికల ప్రచారం తుది దశకు రావడం, ఈ నెల 31న పోలింగ్ తేదీ ఉండటంతో ఎన్నికల కమీషన్ నవంబర్ 28 మంగళవారం సాయంత్రం నాటికి బహిరంగ ప్రచారం, మైక్‌లు, డీజేలు, ఇతర సాధనలతో పాటు ప్రచార ర్యాలీలు, ఊరేగింపులు, గుంపులుగా ప్రచారం చేయడాన్ని నిషేధించాయి. దీంతో గత 25 రోజులుగా నిర్వహిస్తున్న ప్రచార హోరుకు తెరపడింది. దీంతో పాటు 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. ఇక మీదట అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేసే క్రమంలో గుంపులు గుంపులుగా వెళ్లేందుకు అనుమతి లేదు.


పోలీస్ కవాత్ నిర్వహిస్తున్న దృశ్యం

## పోలీస్ కవాత్...

**వంగూరు, నవంబర్28, ప్రభాతవార్త:** జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఉద్దేశంతో గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో పోలీస్ కవాత్ నిర్వహిస్తున్నట్లు సీఐ సోమనర్సయ్య తెలిపారు. మంగళవారం సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ భద్రత బలగాలతో మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, పోల్కంపల్లి, డిండిచింతపల్లి, చౌదర్‌పల్లి, వంగూరు, తుమ్మలపల్లి పాటు మండల కేంద్రంలోపోలీస్‌కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే గ్రామాలను గుర్తించామని, అక్కడ పోలీసులతో, ఇతర పోలీసు బలగాలతో పర్యవేక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైన అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిజాయితీగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు పోలీసు కవాత్ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికలకు సహకరించి సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీ గ్రాండ్ సక్సెస్

● విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడమే మా లక్ష్యం ● ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి

**కల్వకుర్తి, నవంబర్ 28 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన పరిఢవిల్లడానికి పటిష్టమైన భారత రాజ్యాంగమే కారణం. అద్భుతమైన అత్యున్నతమైన భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి స్ఫూర్తి నింపడానికి భారత రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26 సందర్భంగా కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి, రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కల్వకుర్తి పట్ట ణంలోని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు మొదటి బహుమతి, కేజీబీవీ ఊర్కొండ ద్వితీయబహుమతి, నిర్మల్‌విద్యాలయం తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు భారత రాజ్యాంగం బుక్ మరియు సర్టిఫికెట్ బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్స్ బహుకరిస్తున్న దృశ్యం

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**వెల్దండ, నవంబర్28, ప్రభాతవార్త:** ఈ నెల 30న నిర్వహించే సర్వ సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలో సీఆర్పీఎఫ్ బలగాలతో కవాత్ నిర్వహించారు. కవాతులో వెల్దండ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని ఆయన సూచించారు. సమస్యాత్మకమైన గ్రామాల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తున్న తరుణంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరుగుతుందని, ఈ విషయాన్ని గుర్తుంచుకొని నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అవాంఛీనయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, సీఆర్పీఎఫ్ బెటాలియన్ సభ్యులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## అసెంబ్లీ పోలింగ్ కేంద్రాలలో ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు

● మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ

**వీపనగండ్ల, నవంబర్ 28, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్ర పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. వైద్యాధికారి మాట్లాడుతూ వీపనగండ్ల చిన్నంబావి ఉమ్మడి మండలాల గ్రామాలలో నవంబర్ 30న తారీఖున జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో ప్రథమ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏ.ఎన్.ఎం, ఆశావర్కర్లకు తెలియజేశారు. అదేవిధంగా గ్రామ పంచాయితీలలో, పల్లె దావఖన కేంద్రాలలో కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని, వృద్ధుల గర్భిణీల, చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల గ్రామపంచాతీలలో వారికి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు చెప్పాలని చెప్పడంజరిగింది. లక్ష్యం పూర్తి చెయ్యని ఆశ వర్కర్లకు పూర్తిచేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం నర్సులు, ఆశ వర్కర్లు సూపర్వైజర్లు, ఆస్తులు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ

## సేవాలాల్ సేన శ్రీనివాస్ నాయక్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**మా జాతిలో ఎదుగుతున్నందుకు ఓర్వలేక దాడులు చేస్తున్నారు..**

**ఆయను అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం కాదు..**

**రాజాపూర్, బాలానగర్ మండలాలకు చెందిన గిరిజన మహిళల హెచ్చరిక**

**బాలానగర్, నవంబరు28 ప్రభాతవార్త:** సేవాలాల్‌సేన జాతీయ అధ్యక్షులు, గిరిజన నాయకులు సభావత్ శ్రీనివాస్ నాయక్‌పై హత్యాయత్నం దారుణమని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని, మా జాతికి ఎంతో సహాయపడుతున్న శ్రీనివాస్‌నాయక్‌పై కక్షకట్టడం సరికాదని రాజాపూర్, బాలానగర్ మండలాలకు చెందిన గిరిజన నాయకులు, మహిళలు ఉన్నారు. మంగళవారం ఈ మేరకు బాలానగర్ మండల కేంద్రంలోని శ్రీనివాస్ నాయక్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని రకాలుగా ఎదుగుతున్న శ్రీనివాస్ నాయక్‌పై ఓర్వలేక కొంతమంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై హత్యాయత్నం చేయడం సరికాదన్నారు. శ్రీనివాస్ నాయక్‌కు ఏమన్నా జరిగితే తామంతా ఊరుకోమని తెలిపారు. గోర్ బంజారా జాతిలో తనలాంటి నాయకుల అండ మాకు అవసరం అని అలాంటి నాయకుడిపై దాడి చేస్తారి అని ప్రశ్నించారు. మా జాతి ఓట్లను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని, తమ నాయకుడిపై దాడిని ఎవరు కూడా ఖండించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ నాయక్‌పై హత్యాయత్నం చేసిన ప్రధాన సూత్రధారుల్ని ఇప్పటివరకు పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలన్నారు. ఆయన కోసం మేము పోరాటం చేస్తామని తెలిపారు. అక్రమ కేసులుపెట్టి అరెస్టు చేయాల్సింది శ్రీనివాస్ నాయక్‌ను కాదని, తమను అరెస్టు చేయండి మేము జైల్లో ఉండడానికి కూడా సిద్ధంగా ఉన్నామని మహిళలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాట్రావత్ రాందాస్, రవి, మూడవత్ అనిత, ఉమ్మడి బాలానగర్ మండల గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## ఘనంగా జ్యోతిరావుపూలె వర్ధంతి



**ఉండవల్లి, నవంబరు28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జ్యోతిరావు పూలె 133వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి యు.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కన్వీనర్ సింగరాజు మద్దిలేటి వ్యవసాయ కార్మిక సంఘం పార్టీ సభ్యుడు చెన్నరాయుడు నాయకులు రాఘవేంద్ర, శివసేన పార్టీ నాయకులు శంకర్‌నాయుడులు పాల్గొని మాట్లాడుతూ జ్యోతిరావు పూలె 1827 ఏప్రిల్ 11న జన్మించి 1890 నవంబర్ 28న మరణించడం జరిగిందన్నారు. జ్యోతిరావుపూలే ఆనాటి కాలంలోని సామాజిక రుగ్మతల కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి మహనీయుని ఆశయ సాధన కోసం పని చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటరాముడు, నరసింహ, శేఖర్, మహబూబ్‌భాషా, అశోక్, నాగరాజు, మధు, విజయ్ పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్నికల ప్రచార పర్వం

**బాలానగర్, నవంబరు 28 ప్రభాతవార్త:** గత ఇరవై రోజుల నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. మంగళవారం సాయంత్రంతో ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపితోపాటు ఇతర పార్టీల ఇండిపెండెంట్ అభ్యర్థుల ప్రచారం ముగిసింది. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్న ఆదేశాలతో పోలీసులు సమగ్రమైన నిఘా ఏర్పాటు చేశారు. పార్టీల నాయకుల కదలికలు కార్యకర్తలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఆయా పార్టీ నాయకులు మునిగిపోయారు. ఈనెల 30వ తేదీన ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ భరితమైన వాతావరణం నెలకొందని చెప్పవచ్చు.

**చిన్నచింతకుంట, నవంబరు 28 ప్రభాతవార్త:** మండలంలో ఎన్నికల ప్రచారం ముగిసింది. నెలరోజులపాటు ఎన్నికల ప్రచారాలలో భాగంగా గ్రామాలలో ఆయా పార్టీల జెండాల రెపరెపలు, కళాకారుల ఆటపాటలు, హోరెత్తించిన మైకులు రెస్ట్ తీసుకుంటున్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, స్వతంత్ర అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం ఐదు గంటల వరకు ఎన్నికల ప్రచారాలకు తెరపడింది. ఆయా పార్టీలు ప్రలోభాల పర్వానికి తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని ఎన్నికల అధికారులు తెలిపారు.

**మండలంలో 36 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు:** తెలంగాణలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల తహసిల్దార్ కృష్ణయ్య తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా చిన్నచింతకుంటలో (6), అమ్మాపూర్ (2) పోలింగ్ కేంద్రాలను నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. మండలంలో మొత్తంగా 31 వేల 51 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. వీరిలో మహిళలు 15 వేల 389, పురుషులు 14 వేల 456 మందితో పాటు కొత్తగా 1206 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తహసిల్దార్ తెలిపారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

● అలంపూర్‌లో 2 లక్షల 37 వేల 938 మంది ఓటర్లు ● 290 పోలింగ్ కేంద్రాలు

● మహిళలు 1లక్ష 20 వేల 81 మంది ● పురుషులు 1లక్ష 17 వేల 850 మంది

**ఇటిక్యాల, నవంబరు 28 ప్రభాతవార్త:** ఈనెల 30వ తేదీ గురువారం సాధారణ ఎన్నికలు జరుగుతుండగా అలంపూర్ నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలలో మొత్తం ఓటర్లు 2 లక్షల 37 వేల 938 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళా ఓటర్లు 1 లక్ష 20 వేల మంది 81 మంది, పురుషులు 1 లక్ష 18 వేల 850 మంది ఓటర్లు ఉన్నారు. ఇటిక్యాల మండలంలో 49 పోలింగ్ కేంద్రాలలో, 41 వేయి 370 ఓటర్లు, అయిజ మండలంలో 80 పోలింగ్ బూతులలో 67 వేల 319 ఓటర్లు, వడ్డేపల్లి మండలంలో బూతులలో 26వేల 955 ఓటర్లు, రాజోలి మండలంలో 33 బూతులలో 27వేల 585 ఓటర్లు, మానవపాడు మండలంలో 34 బూతులలో 25వేల 539 ఓటర్లు ఉండవెల్లి మండలంలో 29 బూతులలో 22 వేల 249 ఓటర్లు, అలంపూర్ మండలంలో 35 బూతులలో 26 వేల 921 మంది ఓటర్లు ఉండగా మొత్తం నియోజకవర్గంలో 2 లక్షల 37వేల 938 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో 1862 మంది ఓటర్లు కొత్తగా మార్పులు, చేర్పులలో పెరగడం జరిగింది. ఈనెల 30వ తేదీన గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు.

## ఆఖరి రోజు ఎన్నికల ప్రచారం ఆటపాటతో ముగిసింది

**కొత్తకోట, నవంబర్ 28, ప్రభాతవార్త:** ఆఖరి రోజు ఎన్నికల ప్రచారం ఆట పాట కొత్తకోట పట్టణ మండలంలో ముగిసింది. మండల కేంద్రంలోని కొత్తకోట తో సహా అన్ని గ్రామపంచాయతీలలో ఆఖరి రోజు ఎన్నికల ప్రచారం హెూరా హెూరీగా కొనసాగింది. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హెూరా హెూరీగా కొనసాగింది. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఆఖరి రోజు అయినందున ప్రచారం చేయడంలో పోటీపడ్డారు. ఎవరికీ వారు గెలుపు పై విశ్వాసం వ్యక్తం చేస్తూ ప్రచారం నిర్వహించారు. తమ పార్టీల మేని ఫెస్టో ప్రజలకు ఇంటింటికి తిరుగుతూ వివరించారు. రాజకీయ పార్టీల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ మా పార్టీకే ఓటు వేయాలని వీధి వీధి తిరుగుతూ హెూరెత్తిన నివాదాలతో ప్రచారం నిర్వహించారు.



# ఎన్నికల కిక్కు..!

- నవంబర్ నెలలో తెగ తాగేశారు..
- రూ.187కోట్ల మద్యం విక్రయాలు
- ఈఏడాదిలో రికార్డు స్థాయిలో..
- ఒకే రోజు ముందుగానే మద్యం దుకాణాలకు తాళం..
- పార్టీలకు తరలిన కోట్లాది రూపాయల లిక్కర్

**నవంబర్ నెలలో మద్యం విక్రయాలు..**

| సర్కిల్ పేరు | ఐఎంఎల్ | బీర్లు | రూ.కోట్లు |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్, నారాయణపేట | 81165 | 78,498 | 72.93 |
| నాగర్‌కర్నూల్ | 51629 | 53,734 | 49.47 |
| గద్వాల | 39282 | 22,616 | 33.02 |
| వనపర్తి | 34893 | 30,042 | 32.12 |
| మొత్తం | 206969 | 1,84,890 | 187.55 |

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 28, ప్రభాతవార:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం విక్రయాలు జోరుమీదున్నాయి. ఎన్నికల నేపథ్యంలో రికార్డు సేల్స్ పెరిగాయి. చాలాచోట్ల చివరి రెండు రోజులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా విక్రయించి నిర్వాహకులు సొమ్ముచేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో నాయకులు, అభ్యర్థులు మద్యం అవసరమున్న వారు ముందస్తుగానే తీసుకొని డంప్ చేసుకున్నారు. ఎక్సైజ్ నిబంధనల మేరకు నిర్వాహకులకు ఎంత మద్యం అవసరమున్నా స్టాక్ మెయింటేన్ చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో అభ్యర్థుల కొనుగోలు శక్తి మేరకు మద్యం నిల్వలను డంప్ చేసుకున్నట్లు సమాచారం. ఎన్నికల్లో భాగంగా సందెట్లో సడేమియా అన్నట్లు దొరికనకాడికి స్టాక్ ఎక్కువ ధరలకు అమ్ముకున్నారు. మద్యం ప్రియులు కూడా ధరలను పట్టించు కోకుండా దొరికిందే చాలే అనే రీతిలో కొనేసి తెగతాగేశారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ కాదు..తక్కువ అమ్మినా నిబంధనలకు విరుద్దం. అయినా ఇవేవి తమకు పట్టవంటూ వ్యాపారులు యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు డివిజన్లు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల ఉన్నాయి. జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల కలిపి 14 సర్కిళ్లున్నాయి.

**లోలోపలే 'బెల్టు' దందా..**

ఎక్సైజ్, పోలీస శాఖ అధికారులు ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బెల్ట్ షాపులపై నిఘా పెట్టి ఉక్కుపాదం మోపారు. అయితే అక్కడక్కడ బెల్టు షాపులు దందా సాగించారు. గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం నిర్వహించారు. అధిక ధరలకు, వేలాపాలా లేకుండా మద్యం విక్రయిస్తుండడంతో పల్లెలు మద్యం మత్తులో తూగుతున్నాయి. ప్రభుత్వ షాపుల్లో దొరకని మద్యం బెల్టు షాపుల్లో దొరుకుతుందంటే ఏ స్థాయిలో మద్యం దందా కొనసాగుతుందో ఇట్టే తెలుస్తున్నది. ప్రణాళిక ప్రకారమే అధిక సేల్స్ ఉన్న కొన్ని రకాల బ్రాండ్లు కేవలం బెల్టు దుకాణాల్లో మాత్రమే దొరుకుతాయి. అలా కొన్ని ప్రాంతాల్లో సిండికేట్ అయి విక్రయాలు జరుపుతూ మందుబాబుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారు. ఎన్నికల వేళ... ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రస్తూ సొమ్ము చేసుకున్నారు. బాటిల్‌పై రూ.5 లేదా రూ.10, రూ.20-30 వరకు ఎక్కువ అమ్మడంతో మద్యంప్రియుల జేబులకు చిల్లులు పడ్డాయి. మద్యం దుకాణాల్లో ఉన్న స్టాక్ మొత్తం రాజకీయ పార్టీల నాయకులు డంప్ చేసుకోవడంతో దుకాణాల్లో స్టాక్ నిల్వలు తగ్గాయి. చివరి వారంలో స్టాక్ కొడితే సేల్ కాకపోవతే పెద్ద మొత్తంలో స్టాక్ మిగిలితే ఇబ్బంది అవుతుందని గమనించిన నిర్వాహకులు స్టాక్ ఎక్కువగా నిల్వ చేసుకోవడానికి ఆసక్తి చూపకపోవడంతో స్టాక్ జీరో కావడంతో ఒకటి రెండు రోజులు ముందుగానే బంద్ చేసినట్లు తెలిసింది.

# మేమే గెలుస్తున్నం..!

# కాదు మేమే గెలుస్తున్నం..

- ఎగ్జిట్ పోల్స్‌తో తికమక
- అన్ని సర్వేల్లో తామే గెలుస్తామంటూ ప్రచారం
- ఏ సర్వేను నమ్మాలో తెలియక ఓటర్లు అయోమయం



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 28, ప్రభాతవార:** మేము గెలుస్తున్నామంటే మేమే గెలు స్తున్నామంటూ వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు సర్వేలు చూపిస్తున్నారు. తాజా సర్వేల ప్రకారం ముందంజలో ఉన్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. సర్వేల ఫలితాలతో ప్రజలు మాత్రం అయోమయంలో పడుతున్నారు. పలానా సర్వేలో తమ అభ్యర్థి ముందున్నాడంటూ ఓటర్లను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఖచ్చితత్వం లేని సర్వేల ఫలితాలతో ఓటర్లు మాత్రం కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. అయితే ప్రధాన సర్వేల సంస్థలు కూడా ఇష్టారీతిగా ఫలితాలు వెల్లడిస్తున్నయనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం ఒక పార్టీ ముందుందని, సాయంత్రం వరకే మరో పార్టీ అభ్యర్థి ముందున్నాడని సర్వేలో దూసుకుపోతున్నాడంటూ ఫలితాలు వెల్లడిస్తుండడంతో జనాలు తికమక పడుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ పేరుతో అభ్యర్థికి అనుగుణంగా ఫలితాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చాలా వరకు డబ్బులు తీసుకొని సర్వేలు చేస్తున్నారని, అభ్యర్థులే ఇష్టారీతిగా పార్టీల వారీగా ఫలితాలు సోషల్‌మీడియాలో వదులుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఓటర్లు మాత్రం చాలా క్లారిటీగానే ఉన్నట్లు తెలుస్తున్నది. సర్వేల ఆధారంగా కాకుండా తమకు మంచి చేసేది, ఇప్పటికీ ఏ ప్రభుత్వం చేసిందో పూర్తి అవగాహనతో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి..

**జిల్లా శిక్షణ నోడల్ అధికారి రవిందర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త :** డిసెంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని జిల్లా శిక్షణ నోడల్ అధికారి రవిందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల బాలికలలో నిర్వహించిన ఎన్నికల కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్స్‌కి శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా ట్రైనింగ్స్ నోడల్ అధికారి రవిందర్ మాట్లాడుతూ ప్రతి లెక్కింపు అధికారి ఎలక్షన్ మాడ్యుల్ ప్రకారం మూడు తారీఖు రోజు నిర్వహించే ఓట్ల లెక్కింపులో ఎటువంటి పొరపాట్లు లేకుండా సవ్యంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఇంఛార్జి దుంకుడు శ్రీనివాస్, మాస్టర్ శిక్షకులు ప్రసన్నకుమార్, ప్రకాష్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

## ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..

**ఎన్నికల పరిశీలకులు బిపి చౌహాన్**

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త :** ఈనెల 30న జరిగే సాధారణ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు బిపి చౌహాన్ తెలిపారు. మంగళవారం మక్తల్‌నియోజకవర్గంలోని ఈవిఎం లో స్ట్రాంగ్ రూమ్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలిసి మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే ఈవిఎంల స్ట్రాంగ్ రూమును, పో లింగ్ మెటీరియల్‌ను తనిఖీ చేశా రు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు బస్సుల ద్వారా ఈవిఎం సామాగ్రిని ఆయా సెక్టోరియల్ వారిగా తరలించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు కుర్చీలు, టేబుళ్ల తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.



# శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరపాలి..

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగొద్దు**

**జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్ర**

**మెగా పోలీస్ బ్రీఫింగ్‌లో పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధన్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త :** శాసనసభ ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అలాగే ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్‌మిశ్రా, ఎస్పీ హర్షవర్ధన్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మెగా పోలీసు బ్రిఫింగ్‌లో అన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎన్నికల విధులకు నియమించబడిన పోలీస్ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన మెగా పోలీస్ బ్రీఫింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ముఖ్యంగా పోలింగ్ రోజున పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని సాంకేతికతలను వినియోగించుకోవాలని, సీనియర్ అధికారుల లాగా పోలీసులు పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 100 మీటర్లలోపు పోలింగ్ స్టేషన్‌లో బయట పరిస్థితులను గమనిస్తూ ఉండాలని, అన్ని పోలింగ్ కేంద్రాలలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించిన వారు తప్ప ఇతరులెవ్వరు వెళ్లడానికి వీలు లేదన్నారు. పోలింగ్ రోజున ఎన్నికల నిబంధనలకు లోబడి అభ్యర్థికి ప్రత్యేక అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పోలీసు పరిశీలకురాలు ఇళక్కియా కరుణాగరన్ మాట్లాడుతూ పోలీసులు నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలని, ఎక్కడ అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని, స్వేచ్ఛ, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అవసరమైనప్పుడు మాత్రమే పోలీసు అధికారాన్ని ఉపయోగించాలని తెలిపారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు డా. కుందన్ యాదవ్ మాట్లాడుతూ పోలీసులు ఎన్నికల నిర్వహణలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా చూసుకోవాలని కోరారు. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించడంలో పోలీసులు ముఖ్య పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని పోలీసులంటే ప్రజలకు గట్టి నమ్మకం అని తెలిపారు.. జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నిర్వర్తించాల్సిన విధులకు సంబంధించి స్పష్టంగా నియమాలను ఎన్నికల సంఘం జారీ చేసిందని, ముఖ్యంగా పోలీసులు ఓపికతో వారి విధులు నిర్వర్తించాలని కోరారు. మంగళవారం 5 తర్వాత సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023 సందర్భంగా నవంబర్ 30న ఎన్నికలు ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు మంగళవారం సాయంత్రం 5 గం.ల తర్వాత నుంచి, డిసెంబర్ 1వ తేదీ (సోమవారం) ఉదయం 7 గం.ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో ఉన్న 881 పోలింగ్ స్టేషన్‌లలో 94 రూట్‌లలో జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి మండలానికి ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ (క్యూఆర్‌టి), స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్ఠంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి క్రిందిస్థాయి సిబ్బంది ఎస్‌హెచ్‌ఓ ఓటరును ప్రలోభపెట్టే రాజకీయ పార్టీ అందించే మద్యం, డబ్బు ఇతర వస్తువులను కనిపెట్టి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు



హాజరైన అధికారులు

# శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పునాది రాలెత్తిన పెద్ద సుంకులయ్య !

**ఉద్యమాల సామాజిక బాధ్యత గల కుటుంబం**

**జీవన పోరాటంలో అలసిన అమరుడు పెరుమాళ్ల సుంకన్న**

**పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవాచారి**



సుంకన్న (ఫైల్)

**కొల్లాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త :** సామాజిక బాధ్యత కలిగిన కుటుంబంగా ఉంటూ సమాజంలో వెనుకబాటుకు గురవుతున్న వారి తరపున పోరుబాట పట్టి భూమికోసం, బడుగుల హక్కులకై బాధ్యతగా సాగిన పెరుమాళ్ళ పెద్ద సుంకులయ్య కుటుంబాన్ని సమాజము, ప్రభుత్వం గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవచారి అన్నారు. సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో ఇటీవల ఆకస్మిక మృతి చెందిన పెరుమాళ్ళ సుంకులయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఆయన మాట్లాడుతూ ఎందరో వలస కార్మికులు ఉన్న పాలమూరు జిల్లాలో వలస కార్మికుడిగా, పేరు మోసిన మేస్త్రీగా మండలంలో వివిధ గ్రామాలలో వందల ఇండ్లు నిర్మించిన మేస్త్రీగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్న పెరుమాళ్ళ పెద్ద సుంకులయ్య మృతి ఆ కుటుంబానికి మరియు సమాజానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట నిర్మాణానికి రాలెత్తిన కూలీలలో ఆయన ఒకరని మండల పరిధిలోని పెద్దదగడ గ్రామానికి చెందిన ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం పునాదిరాళ్లు మోయడం జరిగిందని ప్రాజెక్ట నిర్మాణం అనంతరం భూమికోసం బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకోసం తన కుటుంబంలో చదువుకున్న కుమారుడిని సైతం కురుమయ్య అలియాస్ రామన్న పోరాటంలో అమరుడయ్యాడని అన్నారు. దళిత హక్కుల సాధన కోసం పోరుబాటలో ఆ కుటుంబం ఎంతో శ్రమించిందని చిన్నంబావిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, బడుగు వర్గాల తరపున ప్రశ్నిస్తూ జర్నలిస్టుగా వారి కుటుంబంలో మరో కుమారుడు కృష్ణానదిలో దక్షిణ తెలంగాణ నీటి వాటాకోసం వెల్టూరు గుందిమల్ల బ్యారేజీ కోసం పోరాడుతున్న ఉద్యమకారుడు సైతం ఉన్నారని అన్నారు. 2010 మలిదశ తెలంగాణ పోరాటంలో సైతం జెఎసి మండల కన్వీనర్‌గా ఉద్యమాన్ని నడిపించిన ఘనత ఆ కుటుంబానికి దక్కిందని నిరంతరం పోరుబాటలో నడుస్తున్న త్యాగాల కుటుంబంగా సుంకులయ్య కుటుంబాన్ని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ గల కుటుంబం కావడంతో సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తున్నారని, సమాజంలో అట్టడుగు వర్గాల తరపున మేధావి వర్గం ఎప్పటికి అండగా ఉంటుందని వారి కుటుంబానికి ఎల్లవేళలా చేదోడుగా ఉంటామని ఆయన అన్నారు. సుంకన్న కుటుంబాన్ని ఉద్యమ కారుల కుటుంబంగా గుర్తించి ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారి భార్యకు పెన్షన్ మంజూరు చేయాలని, అలాగే మూడు ఎకరాల భూమిని సైతం ప్రభుత్వం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమకారుల కుటుంబాలకు చేదోడుగా నిలవాల్సిన ప్రభుత్వాలు అణిచివేతకు గురి చేస్తున్నారని ఇది ప్రభుత్వ బాధ్యత రాహిత్యమని సామాన్యుల పాలిట గుదిబండగా మారొద్దని అండగా నిలవాలని అన్నారు. ఇటీవల సుంకలయ్య మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబానికి తన సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, వనపర్తి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి యూసుఫ్, టీచర్ కురుమయ్య, శ్రీశైలం నిర్వాసితుల సంఘం నాయకులు రామచంద్రసాగర్, పెద్ద మల్లయ్య, వెల్టూరు, గుందిమల్ల సాధన సమితి నాయకులు పెరుమాళ్ళ శ్రీనివాస్, కాశన్న యాదవ్, పెరుమాళ్ళ వెంకటేష్, తిరుపతయ్య, కురుమయ్య, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



సుంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



సుంకన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాఘవాచారి

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు

# పకడ్బందీగా ప్రణాళికలు అమలు చేయాలి..

**జిల్లా సాధారణ పరిశీలకులు సోమేష్ మిశ్రా**

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 28, ప్రభాతవార్త :** సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికల నిశ్శబ్దత ప్రారంభమైందని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు అమలు చేయాలనీ వనపర్తి జిల్లా సాధారణ పరిశీలకులు సోమేష్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం ఉదయం ఐ.డి.ఒ.సి.కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అబ్జర్వర్ రాజీవ్ మాల్హోత్రా, వ్యయ పరిశీలకులు రాజేంద్ర సింగ్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద లాల్ పవార్, ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి తో కలిసి ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 గంటల ఎన్నికల నిశ్శబ్దత నిబంధనలను కఠినంగా చేయాలని ఎవరైనా నిబంధనలు అదిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. ఎస్.ఎస్.టి బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పోలీస్ సిబ్బందితో కలిసి మరింత పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, ఎక్కడ ఫిర్యాదు వచ్చిన నిమిషాల వ్యవధిలో చేరుకొని చేదించాలని ఆదేశించారు. పోలింగ్ డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ కేంద్రాల వద్ద నిబంధనలకు అనుగుణంగా సాఫీగా జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఒక మెబాయిల్ ఆరోగ్య వాహనం అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారిని ఆదేశించారు. నోడల్ అధికారులు, సిబ్బంది విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు కఠినంగా ఉంటాయని ఆదేశించారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతి రావు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో సమీక్షా నిర్వహించిన జిల్లా సాధారణ పరిశీలకులు సోమేష్ మిశ్రా

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి అందరు 8గం.ల వరకు

# చేరుకోవాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఈవిఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి దత్త ఇనిస్టిట్యూట్ ఆఫ్ టీచర్స్ ఎడ్యుకేషన్ సింగారంలో బుధవారం ఉదయం 8 గం.లకల్లా ఎన్నికల అధికారులు, సిబ్బంది చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల వరకు అందరు ఎన్నికల సిబ్బంది హాజరు హాజరు కావాలన్నారు. డీఈఓ రెస్పాన్సిబిలిటీ అందరు టీచర్లు హాజరు కావాలన్నారు. రిజర్వులో ప్రతి ఒక్కరు హాజరు కావాలి టిఫిన్, భోజనం ఏర్పాటు చేసినందున ఎన్నికల సిబ్బంది ఉదయం 11.30 గం.లకు ఎన్నికల సామాగ్రితో డిస్పాచ్ కావాలన్నారు. డిఎంహెచ్ఓ ఆశా వర్కర్, ఎఎన్ఎంలు అందుబాటులో ఉండాలన్నారు. డిఎల్‌పిఓ రెస్పాన్సిబిలిటీ పంచాయతీ సెక్రెటరీలతో కో ఆర్డినేషన్ చేసుకోవాలి. అధికారులు ఫోన్‌లో అందుబాటులో ఉండి పర్యవేక్షించాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

## లాడ్జిలలో ఫంక్షన్ హాల్‌లో బయట వ్యక్తులు ఉండరాదు

**జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త :** జిల్లాలో నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల పరిధిలో ఫంక్షన్‌హాల్‌లు, లాడ్జింగ్‌లలో బయటి వ్యక్తులు ఉండరాదని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ సందర్భంగా సంగం బండ రోడ్డులోని ద్వారకా ఫంక్షన్ హాల్‌ను ఎఫ్ఎస్‌టి 4 టీం సభ్యులు ఖాళీ చేయించి ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇంకా ఎక్కడైనా ఫంక్షన్ హాల్‌లో లాడ్జింగ్‌లో బయట వ్యక్తులు ఉండరాదని ఆదేశించారు.

## అలంపూర్‌ను ఎంతో అభివృద్ధి చేశాం..

**- మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం**

ఇటిక్యాల, నవంబరు 28 ప్రభాతవార్త : అలంపూర్ నియోజకవర్గం తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలలో తాను ఎంపిగా ఉన్నప్పుడు అదేవిధంగా అలంపూర్ నుండి ప్రస్తుత ఎమ్మెల్యే అబ్రహం ఉన్నప్పుడు వందలాది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ ప్రాజెక్టుకు జూరాల లింకు కెనాల్ ఏర్పాటు, డబుల్ బిటి రోడ్లు వంటివి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు అలంపూర్ ఎస్సీ నియోజకవర్గంలో దళితుల మధ్య చిచ్చుపెట్టి అగ్రవర్ణాల కులాల వారు ఆధిపత్యం చెలాయిస్తున్నారని మాలాంటి అభివృద్ధి కారకులను టికెట్ రాకుండా చేసి అవమానపరిచారని మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ఆరోపించారు. మంగళవారం కొండేరు ర్యాలీలో వారు మాట్లాడారు.

1996 నుండి 2014 వరకు తాను ఎంపిగా నాలుగుసార్లు పని చేశారనని ఆ సమయంలో అలంపూర్ నియోజకవర్గమే కాక తన సొంత గ్రామం కొండేరులో కూడా సిసి రోడ్లు, బిటి రోడ్డు, బిసిలకు గృహాల మంజూరు, కల్వర్టులు చౌరస్తాల సెంట్రల్ లైటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గాన్ని వందలాది కోట్ల రూపాయలతో ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మంద శ్రీనాథ్, డా. అజయ్, జడ్పీటిసి రాజు, జోగుల రవి, వెంకటేష్ యాదవ్, నీలి శ్రీనివాసులు, సోమనాద్రి, మధునాయుడు, జయ చంద్రారెడ్డి, రవిబాబు, యువరాజు, ప్రభుదాస్, భాస్కర్‌రెడ్డి, రుక్మానందరెడ్డి, శ్రీను, యోహాను, మంద దేవన్న, మహిళా అధ్యక్షురాలు రాధ, బజారన్న పాల్గొన్నారు.

## భగవద్గీత కంఠస్థ పోటీలలో తపోవన్ విద్యార్థుల ప్రతిభ..

**దేవరకద్ర, నవంబరు 28 ప్రభాతవార్త :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవరకద్ర మండల స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలలో శిశు స్థాయిలో విద్యాజ్యోతి పాఠశాలకు చెందిన నవ్యశ్రీ ప్రథమ స్థానంలో గీతక్ ద్వితీయ స్థాయిలో గెలుపొందారు. ప్రాథమిక స్థాయిలో తపోవన్ పాఠశాలకు చెందిన సహస్ర ద్వితీయ స్థాయిలో గెలుపొందారు. మాధ్యమిక స్థాయిలో తపోవన్ పాఠశాలకు చెందిన అద్విక ప్రథమ స్థానంలో, హారిక ద్వితీయ స్థాయిలో గెలుపొందారు. ఉన్నత స్థాయిలో తపోవన్ పాఠశాలకు చెందిన సందీప్ ప్రథమ స్థానంలో, సంగీత ద్వితీయ స్థాయిలో గెలుపొందారు. కళాశాల స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గౌతమి ప్రథమ స్థానంలో, శ్రీజ ద్వితీయ స్థాయిలో గెలుపొందారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు వచ్చేనెల 3వ తేదీన జిల్లాస్థాయి పోటీలు నిర్వహించబడును. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చంద్రయ్యశెట్టి, ఉపాధ్యాయులు ప్రభాకర్, చంద్రయ్య, ఆంజనేయులు, నర్సింహ, రవిందర్ పాల్గొన్నారు.



భగవద్గీత కంఠస్థ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులు

